క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే జరిమానా



గురజాల: బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా విధించడం జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణరావు పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా ప్రకటించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేట్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పొదుపు మహిళా సంఘాలసభ్యులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన జరిగితే రూ.500 జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

పాలువాయిలో వరిపంట కోత ప్రయోగం

ఎకరాకు 45 బస్తాల దిగుబడి



రెంటచింతల: మండలంలోని పాలువాయి గ్రామంలో శనివారం పంటకోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పిన్నమనేని సావిత్రమ్మ సాగు చేస్తున్న వరిపొలంలో ఈ ప్రయోగం చేపట్టినట్లు వెల్లడించారు. పొలంలో 25 చదరపు మీటర్ల పరిధిలో ఈ ప్రయోగం (నూర్పిడి) చేయగా సుమారుగా 45 బస్తాల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. వివిధ గ్రామాలలో రబీలో వరి పంటను సాగు చేస్తున్న రైతులు ఎకరాకు రూ. 680 ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హెచ్ఐవీపై అందరికీ అవగాహన అవసరం



పిడుగురాళ్ల: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రమాదేవి, రవితేజలు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లెనిన్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వ్యాధిని మాత్రమే మనం దూరం పెట్టాలి గానీ రోగిని కాదని తెలియజేశారు. అనంతరం ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. నాగరాజు, జయలక్ష్మి, రవి, శౌరీలు, జానీమీరా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానాలు



మాచర్ల: కార్తిక మాసం పురస్కరించుకొని పలు దేవాలయాల్లో శనివారం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. శనివారం ఉదయం నుంచి రామప్ప దేవాలయం, శ్రీ గంగా పార్వతి నగరేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవాలయం, కోదండ రామాలయం, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి, అయ్యప్ప స్వామి దేవాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు అర్చకులు, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా దేవాలయాలలో నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానాలు జరిగాయి.

వాహనాల తనిఖీ



మాచర్ల: పట్టణంలో సాగర్ రోడ్డులోని ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) శేషురెడ్డి, ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామిల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. 8 వాహనాలపై కేసులు నమోదు చేసి, ఒక వాహనాన్ని సీజ్ చేశారు. రూ. 35,610 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శేషురెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినా, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వాహనాల్లో లేకపోయినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పల్లెల్లోనూ ‘డిజిటల్’ హవా

- యూపీఐ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్లు
- గ్రామాలకూ విస్తరించిన వైనం
- బడ్డీ కొట్టు నుంచి మాల్స్ వరకు..
- అత్యధిక శాతం డిజిటల్ చెల్లింపులకు మొగ్గు
- చిల్లర సమస్యలకు చెక్..



నడికుడిలోని ఓ చిల్లరకొట్టులో ఏర్పాటు చేసిన డిజిటల్ పేమెంట్ క్యూఆర్ స్కానర్

దాచేపల్లి: డిజిటల్ లావాదేవీలు ప్రతి పల్లెకూ చేరాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్ని రకాల దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు అత్యధికంగా జరుగుతున్నాయి. దుకాణంలో రూపాయికి కొనుగోలు చేసినా యూపీఐల ద్వారా నేరుగా పేమెంట్ చెల్లిస్తున్నారు. ఒకప్పుడు పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమైన డిజిటల్ లావాదేవీలు ఇప్పుడు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించాయి. మారుతున్న సాంకేతికతను ప్రజలు అందిపుచ్చుకుని సమస్యలు లేని లావాదేవీలు జరుపుకొనేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణాలతో పాటుగా గ్రామాల్లో సైతం నగదు రహిత లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫోన్‌పే, గుగూల్ పే, పేటీఎం, భారత్ పే తదితర క్యూఆర్ కోడ్ స్కానర్లు ఏ దుకాణంలో చూసినా దర్శనమిస్తున్నాయి.

డిజిటల్ పేమెంట్లపై పెరుగుతున్న ఆసక్తి

వినియోగదారులతో పాటుగా దుకాణాదారులు డిజిటల్ పేమెంట్లకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దేశవ్యాప్తంగా 2016లో పెద్ద నోట్ల రద్దు తరువాత ఆర్థిక లావాదేవీలను డిజిటల్ ద్వారా చెల్లించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. ప్రారంభంలో ఈ లావాదేవీలు పెద్దపెద్ద పట్టణాలకే పరిమితం అయినప్పటికీ క్రమేణా ఇవి గ్రామాలకు చేరాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్న ప్రతి చోట డిజిటల్ పద్ధతిలో నగదు రహిత చెల్లింపులు ఎక్కువగానే జరుగుతున్నాయి. గురజాల నియోజకవర్గవ్యాప్తంగా సుమారుగా 8వేలకు పైగా వివిధ రకాల దుకాణాలు ఉన్నట్లుగా సమాచారం. ప్రతి దుకాణంలోను డిజిటల్ పేమెంట్లకు సంబంధించిన స్కానర్లు దర్శనమిస్తున్నాయి. కిరాణా, ఫ్యాన్సీ, పెట్రోల్‌బంకులు, హోటల్స్, లాడ్జిలు, టీ దుకాణాలు, పండ్ల దుకాణాలు ఇలా ప్రతి చోట్ల అత్యధికంగా యూపీఐ ద్వారానే పేమెంట్లు చేస్తున్నారు.

దుకాణాల్లో అత్యధికంగా చెల్లింపులు

ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌లు చిరువ్యాపారులకు అందుబాటులో వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగటంతో థర్డ్‌పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్‌లను క్యూ ఆర్ కోడ్, స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నారు. నగదు చెల్లించిన వెంటనే స్పీకర్‌ద్వారా ఎంత నగదు జమ అయ్యిందే వాయిస్ ఓవర్‌ద్వారా తెలియజేస్తుంది. డిజిటల్ పేమెంట్ చేయటం వలన చిల్లర సమస్యలకు కూడా చాలావరకు చెక్ పడింది. గతంలో చిల్లర లేకపోవటం వలన వ్యాపారాలు సక్రమంగా జరిగేవి కావు. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి రావటం వలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగదు అకౌంట్‌లో జమకావటంతో వ్యాపారులు సంతోషంగా ఉంటున్నారు. రోజుకి రూ.3వేల నుంచి లక్ష వరకు దుకాణాల్లో స్కానర్లద్వారా నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. స్పీకర్ ఏర్పాటు చేయటం వలన దుకాణాదారులు సంబంధిత కంపెనీకి నెలకు రూ.120 వరకు చెల్లించాల్సి ఉంటుంది.

చిల్లర సమస్యలకు చెక్



డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి రావటం శుభ పరిణామం. గతంలో చిల్లర లేక వస్తువులను సక్రమంగా అమ్ముకోలేకపోయాం. ఇప్పుడు ఏ వస్తువులు కొనుగోలు చేసినా డబ్బులు లేకపోతే ఫోన్‌పే, గుగూపే, పేటీఎం, భారత్‌పే ద్వారా డిజిటల్ లావాదేవీలను చెల్లిస్తున్నారు. డిజిటల్ లావాదేవీల కారణంలో వ్యాపారం ప్రశాంతంగా జరుగుతుంది. ప్రధానంగా చిల్లర ఇచ్చే సమస్యలు చాలా వరకు తీరాయనే చెప్పొచ్చు.

– నాళం శ్రీనివాసరావు, కిరణా దుకాణం, నడికుడి

స్పీకర్ ద్వారా నగదు చెల్లింపు తెలుస్తుంది..



డిజిటల్ పేమెంట్స్‌లో లాభాలతో పాటుగా మోసాలు కూడా ఉన్నాయి. కానీ ఈ మధ్య స్పీకర్ సిస్టమ్ అందుబాటులోకి రావటం వలన మోసాలకు అడ్డుకట్టపడింది. నేను వ్యాపారం చేస్తుండగా యూపీఐ ద్వారా నగదు చెల్లించామని చెబుతారు. వ్యాపారం బిజీగా ఉన్నప్పుడు కొంతమంది పే చేసినట్లు చెప్పినా నగదు జమ కాదు. ఇప్పుడు స్పీకర్ సిస్టం రావటం వలన ఎంత చెల్లించారనేది వెంటనే తెలుస్తుంది. ఎంత చెల్లించారో తెలుగులోనే స్పష్టంగా చెప్పటం వలన మాకు అర్థమైతుంది. డిజిటల్ పేమెంట్ల కారణంగా వ్యాపారాలు కూడా పెరిగాయి. – సిద్దల శివ, పండ్ల దుకాణం నిర్వాహకుడు, దాచేపల్లి

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

గురజాల: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కోర్టు భవనాల నందు శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురజాల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్.శరత్ బాబు సూచనల మేరకు పలువురు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పెండింగ్‌లో వున్న రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుని కక్షిదారులకు అవగాహన కల్పించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పోలీస్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగమణి, న్యాయవాదులు షేక్ జానీబాష, సుందర జ్ఞానమ్మ, కలివెల ప్రభుదాసు, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ



పిడుగురాళ్ల: పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రత్తయ్యను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు శెట్టిపల్లి పూర్ణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



దంత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల వసతిగృహంలోని విద్యార్థులకు హెల్త్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో ఉచితంగా దంత వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. తొలుత గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సరైన దంత విధానంతో ఆరోగ్యకరంగా జీవించగలుగుతామని తెలిపారు. అంతేకాకుండా పంటి నొప్పి వలన ఏకాగ్రత తగ్గుతుందని, ఎప్పటికప్పుడు పళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. శ్రీ సాయి కృష్ణ డెంట్ కేర్ వైద్యులు శివరామకృష్ణన్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వనజ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, శ్రీలత హాస్పటల్ సిబ్బంది రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలో శనివారం డాక్టర్ రామలింగారెడ్డి కంటి వైద్యశాల సిబ్బంది ఉచితంగా 115 మందికి కంటి వైద్య పరీక్షలు చేసినట్లు శివాలయం అధ్యక్షుడు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి తెలిపారు. అనంతరం వారికి ఫ్యామిలీ కార్డులను అందచేశారని, ఈ కార్డు ద్వారా ఆ కుటుంబంలో నలుగురు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చాన్నారు. వైద్య సిబ్బంది కె.రాజు, మురళి, తేజ, కృష్ణ, కోటేశ్వరరావు తదితరులున్నారు.

ఉత్తమ పోస్ట్‌మాస్టర్‌గా వీరాంజనేయులు



పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీరాంజనేయులు

రెంటచింతల: ఉత్తమ పోస్ట్‌మాస్టర్‌గా అవార్డు తీసుకున్న బి.వీరాంజనేయులును పోస్టల్ శాఖా సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని విజయవాడ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి అన్నారు. శనివారం చిలకలూరిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన పోస్టల్ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా పోస్టల్ సర్వీసులు అధికంగా చేయించిన వీరాంజనేయులుకు ఆయన అవార్డును అందచేసి మాట్లాడారు. పీఎల్ఐ చేయించినందుకు, అత్యధికంగా పోస్టల్ సేవింగ్ ఖాతాలు, సుకన్య ఖాతాలు చేసినందుకు ఆయనను అవార్డు వరించిందన్నారు. మాచర్ల పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహించిన 2023–24 సమయంలో కూడ వీరాంజనేయులు రెండు అవార్డులు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. పోస్టల్ ఖాతాదారులకు, ఏజెంట్లకు మెరుగైన సేవలు అందించిన వారికి అవార్డులు రావడం సహజమన్నారు. అవార్డు గ్రహీతను స్థానిక ఏజెంట్లు పల్నూరి మల్లి, ప్రభాకర్, నాళం చిన్నబాబు, ఓరుగంటి ఆదిశంకర్, తుమ్మా సరిత తదితరులు అభినందించారు.

దాచేపల్లి సీఐగా భాస్కర్



దాచేపల్లి: దాచేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.భాస్కర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గురజాల నుంచి బదిలీపై దాచేపల్లి వచ్చిన ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ అధికారులు, సిబ్బందిలో మాట్లాడి పలు విషయాలపై సూచనలు చేశారు. నిఘా వ్యవస్థను పటిష్టం చేయడం తోపాటు, చోరీలు, దాడులు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐలు సౌందర్యరాజన్, పాపారావులు సీఐ భాస్కర్‌ను సన్మానించారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.మురళీ గంగాధర్‌రావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి ఎం.మురళీ గంగాధర్‌రావు

పిడుగురాళ్ల: సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.మురళీగంగాధర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లోని కార్డ్స్ సూకల్‌నందు బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ టి.అమర్నాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో బాల్య వివాహాలను అరికట్టాలని, 18 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు మాత్రమే వివాహం చేయాలన్నారు. బాలల హక్కులను పరిరక్షించాలని, విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులచేత న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, ఏజీపీ ఎ.రూత్ బనియన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.ప్రసన్నకుమారి, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం ఎం.నాగేశ్వరరావు, ఎస్ఎంహెచ్ఆర్సీ కమిటీ అధ్యక్షులు టి.శౌరిబాబు, సుభాని, శ్రీనివాస బాబు, అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు దేగల అబ్రహాం, మాజీ కౌన్సిలర్ చిలక చిన్నా, ఏఎస్ఐ హనుమంతరావు, పాఠశాల హెచ్ఎం పి.లత, టీచర్లు దయమణి, వై.సునీత, రహీమ్, దళిత సేవాదళ్ టి.చందు, ఇసరం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ట‘మోత’!



మార్కెట్‌లో దిగుమతి అయిన టమాటాలు

యడ్లపాడు: తగ్గినట్టే కనిపించిన టమాటా ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. శుక్రవారం దీని ధర కిలో రూ.60కి పలికింది. గత వారం కేజీ ధర రూ.40లోపే ఉండగా, వారంలోనే భారీ పెరుగుదల కనిపించింది. ఇతర ప్రాంతాల్లో సరుకు లేకపోవడం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తుఫాను రావడం వెరసి టమాటా ధరకు డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు. అదే విధంగా ఉల్లిపాయలు రూ.50, బీన్స్‌పిక్కలు రూ.120, చిక్కుడు రూ.100లకు చేరాయి. బెండకాయలు రూ.60, వంకాయలు రూ.50, దొండకాయలు రూ.40 ఉన్నాయి. కార్తికమాసం ఆదివారంతో ముగుస్తుండటంతో వచ్చేవారానికి వీటి ధరలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు

ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ... పట్టణంలోని 8,9,10,14,15 వార్డుల్లో వాటర్ పైపులైన్ పనులు చేపట్టడం జరిగిందని, పైపులైన్‌లు పూర్తయిన తర్వాత ఆయా వార్డులలో కృష్ణా నీటిని ప్రజలకు అందించటం జరుగుతుందని తెలిపారు. అలాగే పట్టణంలోని పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తిగా నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం పలువురు వార్డు కౌన్సిలర్లు ఆయా వార్డులలో సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మాచర్లగా మార్చేందుకు కృషి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్ల: పట్టణాన్ని స్వచ్ఛ మాచర్లగా మార్చేందుకు కౌన్సిల్‌తో పాటు అధికారుల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పురపాలక సంఘ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ నరసింహారావు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా మొత్తం 20 అంశాలపై చర్చ జర్గ్గా కూరగాయల మార్కెట్‌కు సంబంధించిన అద్దెల పెంపు అంశం మినహా మిగతా అంశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కాంప్లెక్స్ సంబంధించి అద్దెలకు ఇచ్చే విషయంలో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి చర్చించి నిర్ణయం తీసుకోవాలని కౌన్సిలర్ సుభాని కోరారు. పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించక పోగా కౌన్సిలర్లను నిర్లక్ష్యంగా చూస్తున్నారని సుభాని, ఎం.శ్రీనివాసరావులు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కమిషనర్ డి.వేణుబాబు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో మున్సి పల్ చైర్మన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ఆయా వార్డు కౌన్సిలర్లకు ప్రాధాన్యత నివ్వటంతో పాటు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. హౌసింగ్ లోన్లకు సంబంధించిన అంశంపై గృహ నిర్మాణశాఖ డీఈ బాలాజీ నాయక్, హౌసింగ్ స్కీం వివరాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉన్నారు. పురపాలక సంఘ డీఈ సుభాని, ఆర్ఐ వెంగయ్య, ఉద్యోగి రాజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం అభినందనీయం

పట్టణ ఎస్ఐ సంధ్యారాణి



పేదలకు అన్నదానం చేస్తున్న పట్టణ ఎస్ఐ సంధ్యారాణి, మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల: పట్టణంలోని నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయమని, ఇందుకు కారకులైన శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి సేవలు ప్రశంసనీయమని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్, నెహ్రూనగర్, బస్టాండ్, రింగురోడ్డు, చెన్నకేశవ దేవాలయం ప్రాంతంలో పేదలతో పాటు పలువురికి అన్నదాన కార్యక్రమాన్ని సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ సంధ్యారాణి పలు చోట్ల స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పేదవారిని ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. పట్టణంలోని 200 మంది పేదలకు అన్నదానాన్ని రెండు పూటలా నిర్వహించారు.

తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన గురజాడ



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్

రెంటచింతల: తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన కవి గురజాడ అప్పారావు అని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాస్‌తో కలిసి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. గురజాడ కవితలు ఇప్పటికీ ప్రజల హృదయాలలో పదిలంగా ఉన్నాయన్నారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలను తూర్పారపట్టిన గొప్ప సంఘసంస్కర్త గురజాడ అని కొనియాడారు. పఠాన్ సత్తాజ్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘స్కిల్’ సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న యువతీ, యువకులు

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సహకారంతో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందిన 18మందికి శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతీ యువకులను స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రోత్సహిస్తున్న ఈ ఉచిత శిక్షణ ఎంతో మంచి కార్యక్రమమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ కిరణ్ నాయక్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రెండవ విడత శిక్షణనివ్వటం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 7942747682 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

పింఛన్లు పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పింఛన్ పంపిణీ కార్యక్రమంలో అధికారులు పాల్గొని త్వరితగతిన అందజేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.